ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
గురువారం 22 ఫిబ్రవరి 2024



వన్‌ధన్ వికాస్ కేంద్రాల బలోపేతానికి చర్యలు

సీతంపేట: వన్‌ధన్ వికాస్ కేంద్రాల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ సురేష్ ఆదేశించారు. బుధవారం పులిగుమ్మి గ్రామాన్ని సందర్శించారు. గిరిజనుల నుంచి కొండచీపుర్లు కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించాలని సిబ్బందికి సూచించారు. గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులు ధరలు పెంచామన్నారు. ఈ మేరకు వారపు సంతల్లో స్టాల్స్‌ను ఏర్పాటు చేసి వాటి కొనుగోలుకు చర్యలు తీసుకోవాని తెలిపారు. డీఆర్ డిపోలు అందుబాటులో ఉండే విధంగా సేల్స్‌మేన్లు దృష్టిసారించాలన్నారు. అనంతరం డివిజన్ కార్యాలయం పరిశీలించారు. ఏపీవో రోసిరెడ్డి, జీసీసీ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి తదితరులున్నారు.

మరణ మృదంగం



పాచిపెంట మండలం సరాయివలసలో గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల

- ఐదు రోజుల్లో ముగ్గురు గిరిజన విద్యార్థులు మృతి
- డిప్యూటీ సీఎం నియోజకవర్గంలోనే ఇద్దరు కన్నుమూత
- వారంతా గిరిజన సంక్షేమ వసతిగృహం విద్యార్థులే..
- రక్తహీనత, అనారోగ్య సమస్యలే కారణమంటున్న సిబ్బంది
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు
- జిల్లాలో తరచూ పునరావృతమవుతున్న ఘటనలు
- శాశ్వత చర్యలు శూన్యం ● పట్టించుకోని ప్రభుత్వం



● ఈ 17న మక్కువ మండలం ఎర్రసామంతవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి అశోక్ అనారోగ్యంతో మృత్యువాత పడ్డాడు. సాలూరు మండలం కారాడవలసకు చెందిన ఈ విద్యార్థి రక్తహీనతతో బాధపడుతుండగా.. హార్ట్ ఎటాక్‌తో చనిపోయినట్లు ఆ పాఠశాల సిబ్బంది చెప్పుకొచ్చారు.



● ఈనెల 20న పాచిపెంట మండలం సరాయివలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న అనిత అనారోగ్యం కారణంగా విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. గిరిశిఖర గ్రామం కొండమోసూరుకు చెందిన ఆ విద్యార్థిని మృతితో తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు.



● తాజాగా గుమ్మలక్ష్మీపురం మండలంలో ఓ విద్యార్థిని అనారోగ్యంతో మృత్యువాతపడింది. దీంతో వ్యవసాయ కూలీలైన తల్లిదండ్రులు బిడ్డిక సింగన్న, కవితలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. వారికి ఇద్దరు సంతానం కాగా.. ఒక్కగానొక్క కుమార్తె అకాల మృతిని తట్టుకోలేకపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. భద్రగిరి గురుకుల పీటీజీ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న రెల్లిగూడ గ్రామానికి చెందిన బిడ్డిక శృతి విశాఖలో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందింది. జ్వరంతో బాధపడుతున్న బాలికను పది రోజుల కిందట భద్రగిరి సీహెచ్‌సీలో చేర్పించారు. రెండు రోజుల తర్వాత పరిస్థితి విషమించడంతో పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. అదేరోజు విజయనగరంలో ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఐసీయూ సౌకర్యం కోసం వెంటనే విశాఖ కేజీహెచ్‌కు బాలికను తరలించారు. వారం రోజుల పాటు వైద్య సేవలు అందించగా.. కిడ్నీ, హార్ట్ దెబ్బ తినడంతో విద్యార్థిని చనిపోయినట్టు పాఠశాల ప్రిన్సిపాల్, హెచ్‌ఎం తెలిపారు. గత ఐదు రోజులుగా తోటి ఉపాధ్యాయులతో కలిసి కేజీహెచ్‌లో ఉండి ప్రత్యేక శ్రద్ధతో వైద్యులతో చికిత్స చేయించామని, అయినా ఫలితం లేకపోయిందని వారు చెప్పారు.

(సాలూరు/పాచిపెంట/మక్కువ/గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 21)

..ఇలా రోజుల వ్యవధిలోనే జిల్లాలో ముగ్గురు గిరిజన విద్యార్థులు మృత్యువాత పడడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. గిరిజన సంక్షేమ వసతిగృహం విద్యార్థులైన వారు రక్తహీనత, అనారోగ్యం కారణంగా మృతి చెందడం వెనుక అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం రాజన్నదొర నియోజకవర్గంలోని మక్కువ, పాచిపెంట మండలాలతో పాటు మాజీ డిప్యూటీ సీఎం, కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి నియోజకవర్గం కురుపాంలోని గుమ్మలక్ష్మీపురంలో వరుసగా ఈ ఘటనలు చోటుచేసుకోవడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. ఉపముఖ్యమంత్రి ఇలాకా లోని గిరిజన వసతిగృహాల్లోనే పరిస్థితి ఇలా ఉంటే.. ఇక మిగిలిన చోట్ల ఎలా ఉంటుందోనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనలకు బాధ్యులు ఎవరు? తప్పెవరిది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాగా ఈ ఘటనలు ఆ తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చాయి. ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకున్న తమ బిడ్డలు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో వారు కన్నీరు మున్నీరవుతున్నారు. బాగా చదువుకుని ప్రయోజకులై.. తిరిగిస్తారని అనుకునుంటే.. ఇలా జరిగిందేమిటని బోరున విలపిస్తున్నారు. తమను, గ్రామాలను ఉద్ధరిస్తారనుకున్న వారు విగత జీవులుగా మారడం చూసి రోదిస్తున్న వారి ఓదార్చడం ఎవరి తరం కావడం లేదు. మరోవైపు ఈ మరణ మృదంగంపై గిరిజన, విద్యార్థి సంఘాల నేతలు సైతం మండిపడుతున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతి నిధులు దృష్టి సారించకపోవడం, ఆయా హాస్టళ్లలో సిబ్బంది పర్యవేక్షణ లోపమే ఇందుకు కారణమని వారు ఆరోపిస్తున్నారు.



కొండమోసూరులో విషాద ఛాయల్లో అనిత కుటుంబ సభ్యులు

ఇదీ పరిస్థితి..

జిల్లాలో సుమారు 45 వరకు గిరిజన వసతి గృహాలు ఉన్నాయి. వాటిల్లో దాదాపు 17 వేల మంది విద్యార్థులు ఉన్నారు. ఆయా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న వారంతా పేదవారే. గిరిశిఖర, రహదారి సౌకర్యం లేని గిరిజన గ్రామాల నుంచి వచ్చిన వారే అధికం. కొండ కోనలు దాటి గిరిజన వసతి గృహాల్లో చదువుతున్న వారిలో ముగ్గురు ఈ నెలలో రోజుల వ్యవధిలో మృత్యువాత పడడంతో మన్యం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. జిల్లాలో తరచూ ఇటువంటి ఘటనలు సంభవిస్తున్నా.. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పటిష్ఠ చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'గిరిజన విద్యార్థుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నాం.. పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందిస్తున్నాం.' అని సర్కారు చెబుతుండగా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. పౌష్టికాహారం సక్రమంగా అందజేస్తే గిరిజన విద్యార్థులు రక్తహీనత, అనారోగ్యంతో ఎందుకు బాధపడుతున్నారన్నది ఆలోచించాల్సిన అంశం. మరోవైపు మరణాల నియంత్రణకు శాశ్వత చర్యలు తీసుకోకపోవడంపై గిరిజన సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ విధంగా చేస్తున్నారా?

వాస్తవంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతివారం వైద్య పరీక్షలు నిర్వహించాలి. ఆ తర్వాత అనారోగ్యం పాలైతే సమీప వైద్యశాలకు తీసుకెళ్లాలి. ఇంకా బాగోలేకుంటే మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించాలి. విద్యార్థి ఆరోగ్య సమస్యలను వారి తల్లిదండ్రులకు తెలియజేయాలి. హౌస్ టీచర్‌తో పాటు ప్రిన్సిపాల్, వార్డెన్, ఉపాధ్యాయ సిబ్బంది బాధ్యత వహించాలి. వైద్య సిబ్బంది సైతం సకాలంలో మెరుగైన వైద్యం అందించాలి. సంబంధిత సిబ్బంది వీటన్నింటినీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులను సమన్వయం చేస్తూ ఉండాలి. అయితే క్షేత్రస్థాయిలో ఆ విధంగా జరగడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.

మెడికల్ టీంలు వేస్తాం..

గిరిజన వసతి గృహాల్లో విద్యార్థుల మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకుంటాం. దీనిలో భాగంగా మెడికల్ టీంలను నియమిస్తాం. స్వల్ప అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులను ఆ టీం పర్యవేక్షించేలా చూస్తాం. ఇప్పటికే మక్కువ మండలం ఎర్రసామంతవలస, పాచిపెంట మండలం సరాయివలస గిరిజన వసతి గృహాల్లో మృత్యువాతపడిన ఇద్దరు విద్యార్థులు సంబంధించి పూర్తి సమాచారాన్ని సేకరించాం. ఇంకా విచారణ కొనసాగుతోంది.

-రుగ్మతరావు, డీడీ, గిరిజన సంక్షేమ శాఖ, పార్వతీపురం మన్యం

ప్రభుత్వమే బాధ్యత వహించాలి..



గిరిజన సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర నేతలు రంజిత్‌కుమార్, సాయిబాబు

సాలూరు రూరల్: జిల్లాలో గిరిజన విద్యార్థుల మరణాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర నేతలు పాలక రంజిత్‌కుమార్, తాడంగి సాయిబాబు అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'గతంలో ఇదే అంశంపై మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయించాం. ఈ మేరకు 2016లో ఆదివాసీ ఆరోగ్యం పేరుతో హెల్త్ వలంటీర్లను గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో నియమించారు. అయితే వైసీపీ ప్రభుత్వం పాలన పగ్గాలు చేపట్టిన తర్వాత హెల్త్ వలంటీర్ల సేవలను నిలిపివేసింది. ప్రస్తుతం జరుగుతున్న గిరిజన విద్యార్థుల మరణాలకు ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుంది. ఇప్పటికైనా హెల్త్ వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి. ఏకలవ్య పాఠశాలలకు ఇరువురు చొప్పున, గిరిజన గురుకులాలకు ఒక ఏఎన్‌ఎంలను నియమించిన ప్రభుత్వం.. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు ఎందుకు నియమించడం లేదు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడానికి మెస్ చార్జీలు పెంచాలి. విద్యార్థులకు సంఖ్య అనుగుణంగా వర్కర్లను పెంచాలి.' అని వారు డిమాండ్ చేశారు.



ఆందోళన చేస్తున్న గిరిజనులు

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాల్సిందే..

● కలెక్టరేట్ వద్ద నినదించిన నిర్వాసితులు


బెలగాం, ఫిబ్రవరి 21 : భూ సేకరణ చట్టం ప్రకారం తమకు నష్టపరిహారం చెల్లించాలని, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని గిరిజన ఇంజినీరింగ్ కాలేజీ నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు గంగునాయుడు మాట్లాడుతూ.. కురుపాం మండలం టేకరకండి వద్ద నిర్మిస్తున్న గిరిజన ఇంజినీరింగ్ కాలేజీ కోసం రెండు మండలాల్లో 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న వారి భూములను దౌర్జన్యంగా తీసుకున్నారన్నారు. దీనిపై గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేస్తే సర్వే రిపోర్టు ఇచ్చారని తెలిపారు. దాని ఆధారంగా హైకోర్టు పిటిషన్ వేస్తే గిరిజనుల పంటలకు రక్షణ కల్పించాలని కోర్టు ఆదేశించినప్పటికీ కొంత భూమిని బలవంతంగా తీసుకుని కాలేజీ నిర్మాణం చేపడుతున్నారని వెల్లడించారు. సీఎం జగన్ కురుపాం వచ్చినప్పుడు.. నిర్వాసితులకు న్యాయం చేస్తామని చెప్పారు కానీ ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే గిరిజనులకు న్యాయం జరిగే వరకు పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లో డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో గిరిజనులు, పలు సంఘాల నేతలు రెడ్డి ఈశ్వరరావు, మోహన్ రావు, పి.రాము, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కుచ్చుటోపి

- ఆలస్యంగా వెలుగులోకి
- డబ్బులు వసూలు చేసి బోర్డు తిప్పేసిన సంస్థ
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

బొబ్బిలి, ఫిబ్రవరి 21: వారంతా కష్టజీవులు.. చెన్నై, హైదరాబాద్, గోదావరి, కృష్ణా జిల్లాలకు వలస వెళ్లి కాయకష్టం చేసుకొని పైసాపైసా కూడ బెట్టుకున్నారు. ఆ డబ్బులన్నీ కొన్నేళ్ల కిందట ఓ బోగస్ కంపెనీకి ఇచ్చారు. డబ్బులు రెండింతలు అవుతాయని ఆ వ్యక్తులు చెప్పడంతో నమ్మేశారు. సంవత్సరాలు గడిచినా స్పందన లేకపోవడంతో మోసపోయినట్లు ఆలస్యంగా గుర్తించారు. బొబ్బిలి మండలం కొండదేవుపల్లి గ్రామానికి చెందిన సుమారు 60 మంది బాధితులు బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌కు వచ్చి తమ మొర వినిపించుకున్నారు. వివరాల్లోకి వెళితే..

ఢిల్లీకి చెందిన ఓ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ తరఫున కొంతమంది ఏజెంట్లు కొన్నేళ్ల కిందట కొండదేవుపల్లి వెళ్లి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేశారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి అధిక వడ్డీ ఇస్తామని నమ్మబలికారు. ఒక్కొక్కరి వద్ద పదివేల రూపాయల నుంచి లక్ష రూపాయలకు పైగా తీసుకున్నారు. ఐదు సంవత్సరాల తర్వాత రెట్టింపు అవుతుందని చెప్పుకొచ్చారు. పాపం పేదలు ఆశ పడి ఆ సంస్థలో డిపాజిట్ చేసుకున్నారు. అయితే సంస్థ ప్రతినిధులు బొబ్బిలి పట్టణంలో బ్రాంచి కార్యాలయం పెట్టి ఆ తరువాత బోర్డు తిప్పేశారు. 2014లో దాచుకున్న ఈ డబ్బుకు ఇంత వరకు ఎటువంటి గ్యారంటీ గాని, తిరిగి చెల్లింపులు గాని జరగలేదు. ఇప్పటికి తాము మోస పోయామని గ్రహించిన స్థానికులు గ్రామపెద్దల దగ్గర పంచాయితీ పెట్టారు. ఏజంట్‌ను పిలిపించి అడిగితే ఆ సొమ్మును తానేమీ తినేయలేదని, కోఆపరేటివ్ సొసైటీలో డిపాజిట్ చేశామని, వారు చెల్లించాలని తెలిపాడు. చేసేదిలేక బాధితులంతా బుధవారం సాయంత్రం బొబ్బిలి పోలీసు స్టేషన్‌కు వచ్చి గోడు వెళ్లబోసుకున్నారు.



డిపాజిట్ చేసిన సొమ్ముకు కంపెనీ ఇచ్చిన బాండు

బాధితులు వచ్చి కలిశారు

కొండదేవుపల్లి గ్రామం నుంచి కొంతమంది మహిళలు వచ్చి కొన్ని బాండ్లు చూపించారు. ఆరేళ్ల నుంచి గ్రామంలో దీనిపై గొడవలు జరుగుతున్నాయన్నారు. ఎవరెవరు ఎంతెంత డిపాజిట్లు చేశారు? బాండ్ల జిరాక్స్‌లను జోడించి సమగ్రంగా ఫిర్యాదు అందించాలని వారికి సూచించాం. పూర్తి వివరాలతో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తాం.

- మలిరెడ్డి నాగేశ్వరరావు, సీఐ, బొబ్బిలి



డిపాజిట్లు చేసి నష్టపోయామని పోలీస్ స్టేషన్ ఎదుట గగ్గోలు పెడుతున్న గ్రామస్థులు

ఎన్నికల పనులు పూర్తి

● కలెక్టర్ నిశాంత్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎలక్షన్ కమిషన్ సూచనల మేరకు జిల్లాలో ఎన్నికల పనులు పూర్తి చేశామని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎన్నికల సంబంధిత అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికలకు సంబంధించిన పనులు, శిక్షణ కార్యక్ర మాలు సజావుగా జరిగాయన్నారు. ఎన్నికల కమిషన్ కార్యాచరణ ప్రణాళిక ప్రకారం అన్ని పూర్తి చేశామని తెలిపారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఈ ఏడాదిలో జనవరి 13 నుంచి ఇప్పటివరకు 717 మందిని ఓటర్లుగా చేర్పించామని, 129 ఓట్లును తొలగించామని వెల్లడించారు. 1091 మంది వివరాలు చేర్పులు, మార్పులు జరిగాయన్నారు.

పనులు వేగవంతం చేయండి

జిల్లాలో గ్రామీణ నీటి సరఫరా విభాగం పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత శాఖ ఇంజనీర్లతో సమీక్షించారు. లక్ష్యాల మేరకు పనులు పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం పనికిరాదన్నారు. నిర్దేశిత లక్ష్యాలకు.. క్షేత్రస్థాయిలో పనులకు పొంతన ఉండడం లేదని, ఈ పరిస్థితి మళ్లీ తలెత్తరాదని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ నుంచి మినహాయించాలి

● ఐటీడీఏ సీఆర్టీల డిమాండ్



కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో సీఆర్టీలు, యూటీఎఫ్ నాయకులు

బెలగాం, ఫిబ్రవరి 21 : ఐటీడీఏ పరిధిలోని సీఆర్టీ పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయించాలని ఆ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ జిల్లా నాయకుడు ఎస్.మురళీమోహన్‌రావు ఆధ్వర్యంలో సీఆర్టీలు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్వతీపురం, ఇతర ఐటీడీఏ పరిధిలో సీఆర్టీలు పనిచేస్తున్నా.. వైసీపీ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో అక్కడ పోస్టులు చూపించడం దారుణమన్నారు. దీనివల్ల ఎన్నో ఏళ్లుగా ఐటీడీఏల పరిధిలో సీఆర్టీలుగా పనిచేస్తున్న వారు ఉద్యోగాలు కోల్పోతారని తెలిపారు. సీఆర్టీల్లో ఎక్కువగా గిరిజనులే ఉన్నారని ఈ నేపథ్యంలో ప్రభుత్వం పునరాలోచించి తగు చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ నిరసనలో సీఆర్టీలు, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించండి

● కలెక్టరేట్ ఎదుట గ్రీన్ అంబాసిడర్ల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు

బెలగాం, ఫిబ్రవరి 21 : తమ వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేశవనాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు జి. వెంకటరమణ మాట్లాడుతూ.. పరిశుభ్రతే లక్ష్యంగా గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు ప్రతి నెలా గౌరవ వేతనాలు చెల్లించ కపోవడం దారుణమన్నారు. వారిని పంచాయతీలకు అప్పజెప్పడంతో సర్పంచ్‌లు చేతులెత్తేస్తున్నారని తెలిపారు. 12 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో గ్రీన్ అంబాసిడర్ల కుటుంబాలు పస్తులతో జీవనం సాగిస్తున్నాయని వెల్లడించారు. జీవో నెంబర్ 68 ప్రకారం వెంటనే జీతాలు విడుదల చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ చేయించాలని నినా దాలు చేశారు. నిరసనలో యూనియన్ నేతలు జె.గౌరి, టి.అశోక్, సీఐటీ యూ నాయకులు రాము, సూరిబాబు, పి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేనకు మద్దతు ఇవ్వండి

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 21: టీడీపీ హయాంలో సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా వెళ్లేదని, ప్రస్తుత ప్రభుత్వం ఈ రెండింటిని వదిలేయడం వల్ల ఆంధ్రప్రదేశ్ తిరోగమనంలోకి వెళ్లిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు అన్నారు. నగరంలోని 45వ డివిజన్‌లో కేఎల్‌పురంలోని కొండవీధి, రెవెన్యూ కాలనీ, బ్యాంకు కాలనీ, మొదలగు ప్రాంతాల్లో ఆమె పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఆరు హామీలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, టీడీపీ హయాంలో పేదల సంక్షేమానికి ఏర్పాటు చేసిన పలు పథకాలను ఈ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. అన్న క్యాంటీన్‌లు, క్రిస్మస్, రంజాన్, సంక్రాంతి కానుకలను రద్దు చేశారన్నారు. చంద్రబాబు పెళ్లి కానుక, చంద్రన్న బీమా.. ఇలా అన్ని పథకాలను రద్దు చేయడం ద్వారా పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహిళా సాధికారిత, ఆర్థిక స్వాలంబన కోసం డ్వాక్రా గ్రూప్‌లు ఏర్పాటు చేసి, వారిలో చైతన్యం నింపిన ఘనత టీడీపీదేనన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేనకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోరాడ శోభారాణి, పెనుమత్స శ్రీను, పి వెంకట మురళీతో పాటు నగర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



45వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమంలో అదితి గజపతిరాజు, టీడీపీ నాయకులు

టీడీపీలో 70 కుటుంబాల చేరిక



పార్టీలో చేరిన వారితో బేబీనాయన

బొబ్బిలి, ఫిబ్రవరి 21: బొబ్బిలి మున్సిపాలిటీ 21వ వార్డు పరిధిలో ఇందిరమ్మ కాలనీకి చెందిన సుమారు 70 కుటుంబాల వారు బుధవారం టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు జక్కువ చంద్రశేఖర్, యాళ్ల వెంకటరమణ, రావాడ గోపి, తెర్లి రామ్మోహన్ ఆధ్వర్యంలో వారంతా బొబ్బిలి కోటకు వచ్చి టీడీపీ ఇన్‌చార్జి బేబీనాయన సమక్షంలో పార్టీలో చేరారు. ఆయన పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పట్టణంలో భారీ మెజారిటీ వచ్చే విధంగా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం చాలా అవసరమని, టీడీపీ-జనసేన పార్టీలను అధికారంలోకి తేవడానికి ఉత్సాహం చూపుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో రామ్మోహన్, సామిరెడ్డి శ్రీరాములు, సింగిరెడ్డి త్రినాథ, యర్రా జగదీశ్, పట్నాల గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం లేకుండా కంపెనీని విస్తరించండి

లక్కవరపుకోట, ఫిబ్రవరి 21: కాలుష్యం లేకుండా... చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కంపెనీని విస్తరించుకునేందుకు ఎటువంటి అభ్యంతరం లేదని వివిధ గ్రామాల ప్రజలు డీఆర్వో అనితకు తెలియజేశారు. ఆర్జీపేట వద్ద గల మా మహామాయ కంపెనీ యాజమాన్యం విస్తరణ కోసం డీఆర్వో ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న ఉత్పత్తులను రెండింతలు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేశామని సంస్థ ఎమ్‌డీ అగర్వాల్ తెలిపారు. అత్యాధునిక సాంకేతిక నైపుణ్యంతో కూడిన కర్మాగారాన్ని నిర్మిస్తామని తెలిపారు. దీనిపై స్థానిక పంచాయతీలు శ్రీరాంపురం, ఆర్జీపేటల గ్రామ పెద్దలు, గ్రామస్థులు వారి అభిప్రాయాలను వెల్లడించారు. ప్రస్తుతం కాలుష్యం ఎక్కువగా ఉందని.. దానిని అరికడుతూ కొత్త కంపెనీ నిర్మించుకునేందుకు ఎటువంటి అభ్యతరం లేదని వడ్లమాని శేషావతారం, పి.కిష్టప్పదొర, జి.అప్పన్నదొరలు తెలిపారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు సరిత, ప్రసాదరావు, తహసీల్దార్ ప్రసాద్, ఎస్ఐ గోపాలరావు, గ్రామస్థులు రంది శంకరరావు, జె.కన్నబాబు, వి.రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో అనిత

జ్ఞాన సరస్వతి విగ్రహం ఏర్పాటు

శృంగవరపుకోట రూరల్: మండలంలోని సంతగైరమ్మపేట ప్రభుత్వ పాఠశాలలో బుధవారం జ్ఞాన సరస్వతి విగ్రహన్ని ఆవిష్కరించారు. విజయనగరం శారదీ సేవాసంఘం ఈ విగ్రహన్ని అందించగా దీనిని వేద మంత్రాల మధ్య పాఠశాల హెచ్‌ఎం బంగారు నాయుడు, గ్రామపెద్దలు గోగాడ సత్యం మాస్టారు, గోగాడ సన్యాసిరావు, గోగాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం ప్రతిష్ఠించారు. విగ్రహనికి పైకప్పును గోగాడ సత్యం మాస్టారు సోదరులు ఏర్పాటు చేశారు. మండల విద్యాశాఖాధికారి నరసింగరావు, సర్పంచ్ కళావతి తదితరులున్నారు.



జ్ఞానసరస్వతి విగ్రహావిష్కరణ దృశ్యం

రెండో విడత నిధులు విడుదల చేయాలి

● సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు మజ్జి రాంబాబు

రామభద్రపురం, ఫిబ్రవరి 21: గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు విడుదల చేయాలని సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు మజ్జి రాంబాబు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నిధులు వేసవి కాలంలో మంచినీటి ఎద్దడి నివారణకు, గ్రామాల్లో పారిశుధ్య పనులకు, డయేరియా వంటి వ్యాధుల నివారణకు ఉపయోగ పడతాయని అన్నారు. ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో నిధుల సమస్య వేధిస్తున్నందున 15వ ఆర్థిక సంఘ నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. అనేక గ్రామ పంచాయతీల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల కొత్త భవనాల నిర్మాణం జరిగాయని... బిల్లులు చెల్లించకపోవడంతో సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్య వెంటనే పరిష్కరించాలని కోరారు. జల జీవన్ మిషన్ కొత్త కమిటీలు వేయడం వల్ల సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎస్.సీతారాంపురం సర్పంచ్ పాలవలస యమున, జన్నివలస సర్పంచ్ జన్ని సారంగదొర, కొండకెంగువ సర్పంచ్ కంచుబిల్లి సుజాత పాల్గొన్నారు.



విలేఖర్లతో మాట్లాడుతున్న రాంబాబు

ప్రమాదాలను అరికట్టండి

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 21: నగరంలోని 42వ డివిజన్ కామాక్షి నగర్ ప్రధాన రహదారి నిత్యం పాఠశాల పిల్లలతో రద్దీగా ఉంటుందని... తక్షణమే స్పీడ్ బ్రేకర్లు వేసి ప్రమాదాలను అరికట్టాలని నగర అభివృద్ధి వేదిక కన్వీనరు త్యాడ రామకృష్ణారావు కోరారు. బుధవారం జాతీయ రహదారుల డివిజన్ కార్యాలయంలో సూపరింటెండెంట్ రమణను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ అక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని... స్పీడు బ్రేకర్లను వేసి... నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న రామకృష్ణారావు

పిల్లలపై నిరంతర పర్యవేక్షణ అవసరం

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 21: పిల్లల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షల సమయంలో నిరంతరం పర్యవేక్షణ అవసరమని... ఆ బాధ్యత ఉపాధ్యాయులదేనని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరీక్షా పర్వా పాయింట్స్ 6, పాయింట్స్ 0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ సైబర్ నేరాలకు బాలలే ఎక్కువగా బలి అవుతున్నారన్నారు. కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ పాఠశాలల వసతి గృహాల్లో పర్యవేక్షణ ఉండాలన్నారు. చిట్టిబాబు, డైట్ ప్రిన్సిపాల్ తవిటి నాయుడు, డీఈవో ప్రేమ్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేసలి అప్పారావు

ఆక్రమణలను అడ్డుకోండి

● జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అప్పలస్వామి

బొబ్బిలి, ఫిబ్రవరి 21: బొబ్బిలి నియోజకవర్గ పరిధిలో గల అన్ని మండలాల్లో అధికార పార్టీ నాయకులు దౌర్జన్యంగా సాగించిన భూ కబ్జాలు, ఆక్రమణల పర్వాలను అధికార యంత్రాంగం అడ్డుకోవాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం ఆయన స్థానిక జనసేన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రామభద్రపురం మండల కేంద్రంలో సుమారు రూ.పది కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని అధికార పార్టీ నాయకులు దర్జాగా కబ్జా చేసేశారని...హైకోర్టు ఆదేశాలతో దీనికి చెక్ పడిందన్నారు. జనసేన మహిళా నేత, మాజీ మంత్రి పడాల అరుణతో కలిసి స్థానిక తహశీల్దారు, రెవెన్యూ అధికారులు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా వారు కబ్జాను అడ్డుకున్నారన్నారు. దీనికోసం పోరాటం సాగించిన జనసేన నాయకులు మహంతి ధనుంజయ, భవిరెడ్డి మహేశ్‌ల విజయంగా ఆయన అభివర్ణించారు. బొబ్బిలి, బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాల్లో భూకబ్జాలను అధికారులు అడ్డుకొని ప్రభుత్వ స్థలాలకు రక్షణ కల్పించాలని గిరడ అప్పలస్వామి కోరారు. ఈ సమావేశంలో మహేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అప్పలస్వామి

ఉపాధి పనులు పరిశీలన

బాడంగి, ఫిబ్రవరి 21: లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని ఎండొర చెరువులో ఉపాధి పనులను ఎంపీడీవో ఆంజనేయులు బుధవారం పరిశీలించారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లతో మాట్లాడుతూ మస్తర్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, గైర్హాజరైన వారి పేర్లను వేయవద్దని సూచించారు. రెండు పూటలా ఉపాధి కూలీలు పనులు చేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న దృశ్యం

డొంకలు, తుప్పల్లో సర్వేరాళ్లు

పట్టించుకోని రెవెన్యూ అధికారులు

రామభద్రపురం, ఫిబ్రవరి 21: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న భూముల రీసర్వే మండలంలో అభాసుపాలవుతోంది. దీని కోసం తెచ్చిన సర్వే రాళ్లు డొంకలు, తుప్పల్లో పడి ఉంటున్నాయి. 2020 నవంబరులో అట్టహాసంగా రీసర్వే మొదలుపెట్టారు. ఇప్పటికీ సర్వే అస్తవ్యస్తంగా సాగడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. రీసర్వేలో సిబ్బంది లీలలు ఒక్కొక్కటిగా బయట పడడంతో ప్రజాప్రతినిదులు, రైతులు అవాక్కవుతున్నారు. సర్వే కోసం మండలానికి 16 వేల సర్వే రాళ్లు తెప్పించారు. వీటిని ఎక్కడపడితే అక్కడ వదిలేసి తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో సర్వే రాళ్లు తుప్పలు, డొంకలకే పరిమితమయ్యాయి. నాయుడువలస, మర్రివలస గ్రామాల మధ్య ఇవి దర్శనమిస్తున్నాయి. ప్రైవేటు వ్యక్తులు సర్వే రాళ్లను సొంత అవసరాలకు వినియోగించుకోవడం పరిపాటిగా మారింది.



డొంకలు, తుప్పల్లో ఉన్న భూముల రీసర్వే రాళ్లు

ఆరు పథకాలపై అవగాహన కల్పించండి

రాజాం: మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోండ్రు మురళీమోహన్ సూచించారు. శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో బుధవారం వంగర మండలం రుషింగి, తలగాం, గీతానాపల్లి, వీవీ ఆర్ పేట, కొండచాకారాపల్లి, కొప్పరవలస, కోణింగిపాడు, ఇరువాడ, చంద్రంపేట, చౌదరివలస పంచాయతీలు టౌన్ 1, 2, 3, 4 వార్డుల నాయకులతో కలిసి రివ్యూ నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. వైసీపీ అరాచకాలు, భూకబ్జాలు, ఇసుక దోపిడీ తదితర అంశాలపై వివరించాలన్నారు.

సీతారామాలయ ప్రారంభోత్సవం

బాడంగి: కామన్నవలస గ్రామంలో శ్రీసీతారాముల ఆలయ ప్రారంభోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా జేసీఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్, జడ్పీటీసీ రామారావు, తెంటు మధు, బేతనపల్లి శంకరరావు, జేసీఎస్ కన్వీనర్ శంకరరావు, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

'చలో కాకినాడ'ను విజయవంతం చేయాలి

బాడంగి: చలో కాకినాడ కార్యక్రమాన్ని ఈ నెల 25న నిర్వహించనున్న నేపథ్యంలో విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర జిల్లాల ఆంధ్రా మాల మన అధ్యక్షుడు ఎండ గోపాలరావు కోరారు. బుధవారం ఆయన చలో కాకినాడ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. వైవై మోహన్, గౌతమ్, వై.వంశీకృష్ణ, పి.సమేల్ పాల్గొన్నారు.

నారీమన్ మృతికి సంతాపం

కొత్తవలస: ప్రముఖ న్యాయ కోవిదుడు, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ఫాలి నారీమన్ మృతికి కొత్తవలస న్యాయవాద సంఘం తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. సీనియర్ న్యాయవాది మృతి న్యాయ వ్యవస్థకే తీరని లోటని న్యాయవాద సంఘ ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ గిరిబాబు అన్నారు. కొత్తవలస న్యాయవాద సంఘం ఆధ్వర్యంలో బుధవారం సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ న్యాయవాదులకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

అనాథలకు ఆర్థిక సాయం

కొత్తవలస: కొత్తవలసకు చెందిన సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలలోని అనాథ, వృద్ధాశ్రమాల వారికి బుధవారం భోజన సదుపాయంతో పాటు దుప్పట్లు, చీరలను పంపిణీ చేశారు. పెందుర్తిలోనున్న వృద్ధాశ్రమంలో 100 మందికి భోజనంతో పాటు పురుషులకు దుప్పట్లు, మహిళలకు చీరలను అందజేశారు. ఆశ్రమ నిర్వహణకు రూ.10 వేలు అందజేశారు. చైతన్య మానసిక పాఠశాలకు చెందిన 45 మంది పిల్లలకు భోజనం, దుస్తులు ఇచ్చారు. బలిఘట్టాంలో ఉన్న న్యూహోప్‌లో అనాథ పిల్లలు 50 మందికి దుస్తులు, రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్టు సేవా కార్యక్రమాలలో డి. శ్రీరామ్, విజయలక్ష్మి, సునీత, తనూజ భాగస్వాములయ్యారని వ్యవస్థాపకుడు కనకాల శివ తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన

కొత్తవలస: వీరభద్రపురం గ్రామంలో బుధవారం ఎయిడ్స్ వ్యాధిపై వీధి నాటకం ద్వారా అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ ఎలా వస్తుంది? రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలను వివరించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష, చిన్నచూపు లేకుండా సమాజంలో ఎలా కలిసి జీవించాలో వివరించారు. సర్పంచ్ గేదెల గురుమూర్తి, వైద్య సిబ్బంది అనూష తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారులో స్టాల్స్ ప్రారంభం

విజయనగరం రింగురోడ్డు: నగరంలోని రింగురోడ్డు రైతుబజారులో బుధవారం ఆధునీకరించిన స్టాల్స్‌ని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రెడ్డి గురుమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు బజార్లలో దుకాణాలు శిథిలమైన నేపథ్యంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చొరవతో ఆధునీకీకరణకు ఆరు నెలల క్రితం శంకుస్థాపన చేశామన్నారు. దాదాపు 30 దుకాణాల వరకూ ఆధునీకరించి ప్రజలకు, రైతులకు, వ్యాపారులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. నగరాభివృద్ధిలో భాగంగా రైతు బజార్లలోనూ మౌలిక సదుపాయాలు కల్పించాలన్న లక్ష్యంతో ఈ పనులు చేశామన్నారు. కార్పొరేటర్లు గాదం మురళి, రైతుబజారు ఏఓలు నాయుడు, ఉమామహేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో కాంగ్రెస్ ఇన్‌చార్జి

రాజాం: రాజాం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల రాజవర్దన్‌ను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మెగా డీఎస్సీ డిమాండ్ కోసం రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు రాలు వైఎస్ షర్మిల పిలుపు మేరకు ఛలో సెక్రటేరియట్‌కు వెళ్లేందుకు సిద్ధమైన ఆయనను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కూని అయ్యిందన్నారు.

పైడిమాంబను దర్శించుకున్న నిత్య విద్యానంద భారతీ స్వామీజీ



విజయనగరం రూరల్, ఫిబ్రవరి 21: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పైడిమాంబను ఆదిపరాశక్తి క్షేత్ర పీఠాధిపతి నిత్య విద్యానంద భారతి బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో ప్రసాదరావు, సూపరింటెండెంట్ ఏడు కొండలు, అర్చకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

● బాలుడి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు



లక్ష్మణరావు (ఫైల్)

డెంకాడ, ఫిబ్రవరి 21: రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, డెంకాడ ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పినతాడివాడ గ్రామానికి చెందిన మజ్జి లక్ష్మణరావు(17) స్థానికంగా ఓ కాలేజీలో ఐటీఐ చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం స్వగ్రామమైన పినతాడివాడ నుంచి గొడ్డుపాలెం గ్రామం మీదుగా జొన్నాడలో జరుగుతున్న గ్రామ దేవత పండగకు తన స్నేహితుడు వాసుతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ సమయంలో గొడ్డుపాలెం నుంచి పినతాడివాడ వైపు వస్తున్న ఒక గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఈ ఘటనలో లక్ష్మణరావు తలకు బలమైన గాయం తగలడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుడు వాసుకి తీవ్ర గాయాలయ్యాయి. మృతుని తల్లిదండ్రులు రామలక్ష్మి, రామారావు రోజు వారీ కూలీలుగా పని చేస్తూ తమ పిల్లలను పోషించుకుంటున్నారు. చేతికి అందివచ్చిన కొడుకు మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుంకరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డెంకాడ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

పిన్నవలసలో చెరుకు పంట దగ్ధం

బాడంగి: పిన్నవలస గ్రామంలో నౌడు కృష్ణ, వాకాడ సుశీల, నౌడు పాపినాయుడుతో పాటు మరి కొంతమంది రైతులకు చెందిన సుమారు 110 టన్నుల చెరుకు బుధవారం దగ్ధమైనట్టు రైతులు తెలిపారు. అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదని వారు వాపోయారు. సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. బాధితులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

పంచాయతీరాజ్ ఇంజినీర్ల ధర్నా



బొబ్బిలి పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న దృశ్యం

బొబ్బిలి, ఫిబ్రవరి 21: ఏపీ పంచాయతీరాజ్ ఇంజినీర్స్ జేఏసీ పిలుపు మేరకు స్థానిక ఈఈ కార్యాలయం ముందు బుధవారం ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది ధర్నా చేశారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు సంబంధించి విజిలెన్స్ విచారణలు, తదితర వేధింపులకు నిరసనగా ఈ ఆందోళన చేపడుతున్నట్లు సంఘ జిల్లా జనరల్ సెక్రటరీ సీహెచ్‌వీ అప్పారావు తెలిపారు. బిల్లులు అందని వారు దాడులకు దిగుతున్నారని, తీవ్రమైన మానసిక ఒత్తిడి గురవుతున్నామని వాపోయారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఏడు నెలలుగా జీతాలు లేవని, రెండేళ్లుగా వాహనాల అద్దెలు, ఎఫ్‌టీఏలు చెల్లించడం లేదన్నారు. నూతనంగా జిల్లాలు, డివిజన్లు ఏర్పాటైనందున కొత్త పోస్టులను మంజూరు చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసులు, ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సీటు కేటాయించాలి

కలెక్టరేట్, ఫిబ్రవరి 21: వచ్చే ఎన్నికల్లో తమ కులానికి ఎంఎల్ఏ సీటు కేటాయించాలని యాదవ సంక్షేమ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద చేపట్టిన 36 గంటల నిరసన దీక్ష బుధవారంతో ముగిసింది. దీక్షలో పాల్గొన్న నాయకులకు జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ నాయకులు ఇసరపు శేఖర్ యాదవ్ నిమ్మరసం ఇచ్చి విరమించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన తమ కులానికి ఎమ్మెల్యే, ఎంఎల్‌సీ సీట్లు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే టిక్కెట్లు కేటాయించిన రాజకీయ పార్టీలకే తమ సామాజిక వర్గ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు సాయికిరణ్ యాదవ్, పడాల గణేష్, బోని సతీష్, బోర వాసు, ఆవాల సతీష్, బాలాజీ, కిరణ్ కుమార్, గొలగాణ రమేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.



దీక్ష చేస్తున్న యాదవ సంఘ నాయకులు

ర్యాంపుల నిర్మాణం పూర్తి చేయాలి

వంగర, ఫిబ్రవరి 21: పాఠశాలల్లో అర్థాంతరంగా నిలిచిపోయిన ర్యాంపులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈవో దుర్గారావు సూచించారు. బుధవారం వంగర, కొప్పర, సంగాం తదితర గ్రామాల్లో పర్యటించి అర్థాంతరంగా నిలిచిన ర్యాంపులను పరిశీలించారు. టెన్త్ పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదుతో మంచి ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. హెచ్‌ఎంలు రామకృష్ణ, గిరి తదితరులు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న ఎంఈవో

ప్రధాన రహదారిపై మురుగు

వంగర, ఫిబ్రవరి 21: సీతారాంపురం బీసీ బాలుర వసతి గృహ సమీపంలో మురుగునీరు ప్రధాన రహదారిపైకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ప్రధాన రహదారితో పాటు పాఠశాలకు వెళ్లే మార్గంలో మురుగునీరు రహదారిపైకి రావడంతో ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పడరాని పాట్లు పడుతున్నారు.

సీతారాంపురం వసతి గృహం ముందు మురుగునీరు



సీపీఎస్ రద్దు చేయండి

వంగర, ఫిబ్రవరి 21: సీపీఎస్‌ను రద్దు చేయాలని, లేదంటే వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని ఉపాధ్యాయ నాయకులు మజ్జి ప్రసాద్, శ్రీధర్ తదితరులు హెచ్చరించారు. మండల విద్యా వనరుల కేంద్రం ఎదుట బుధవారం వారు ఆందోళన చేపట్టారు. ఎన్నికల ముందు జగన్ హమీలు గుప్పించి.. అధికారంలోకి వచ్చిన తరువాత వచ్చిన వాటిని తుంగలో తొక్కడం సబబు కాదన్నారు. ఈ మేరకు ఎంపీపీ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యాక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంపీపీకి వినతి పత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

మల్లమ్మపేటలో కమిషనర్ పర్యటన

బొబ్బిలి, ఫిబ్రవరి 21: మల్లమ్మపేట గ్రామంలో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి బుధవారం పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. గ్రామ శివారులో పారిశుధ్య లోపం తీవ్ర అసౌకర్యం కలిగిస్తోందని... మురుగు నీరు లోతట్టు ప్రాంతాలకు వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గొల్లపల్లి సచివాలయంలో ఆరోగ్య సురక్ష ఫేజ్-2 కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు.

మల్లమ్మపేటలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్



మాతృభాషను పరిరక్షించుకుందాం

బొబ్బిలి, ఫిబ్రవరి 21: మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని భాషా పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ప్రతినబూనాలని రోటరీక్లబ్, కారుణ్యఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు అన్నారు. బుధవారం స్థానిక కళాభారతి ఆడిటోరియం ముందు గల తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలవేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాతృభాష పరిరక్షణకు నడుంబిగించిన భాషాభిమానులు, మేధావులందరికీ మద్దతుగా నిలవాలన్నారు. తెలుగు అధ్యాపకుడు బొంతు శ్రీరాములు మాట్లాడుతూ ఎన్ని భాషలను నేర్చుకున్నప్పటికీ మాతృభాషను ఎట్టిపరిస్థితుల్లో విస్మరించరాద న్నారు. తెలుగు భాష ప్రాశస్త్యాన్ని, గొప్పతనాన్ని నేటి బాలలు కచ్చితంగా తెలుసుకోవాలన్నారు. శ్రీకృష్ణదేవరాయలతో పాటు తెలుగు కవులు ఎంతోమంది ఇందుకోసం చేసిన కృషిని మన మంతా కొనసాగించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు భాషకు సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. తెలుగు లెక్చరర్ బొంతు శ్రీరాములు, సీహెచ్‌జే ప్రవీణ్ కుమార్, ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ సంఘం నాయకుడు కేతిరెడ్డి చంద్ర, భాషాభిమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట రూరల్: మండలంలోని ధర్మవరం పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రముఖ రచయిత చలం మాస్టారిని మాతృ భాష దినోత్సవం సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఆధ్వర్యంలో సత్కరించారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో తెలుగుభాష ఉన్నతికి ఎంతో కృషిచేస్తున్న చలం మాస్టారి గురించి విద్యార్థులకు వివరించారు. ● **రాజాం:** ఘనంగా మాతృభాష దినోత్సవం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయుడు మీగడ మల్లిఖార్జున స్వామి, దుర్గారావులను సత్కరించారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్ కుమార్, కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్, ఉపాధ్యాయులు గట్టి పాపారావు, కోశాధికారి దామెర సీతారమేష్, సంస్థ సభ్యులు నాయుడు, పెంకి చైతన్యకుమార్, పాఠశాల కరస్పాండెంట్ గట్టి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలిలో..



ఎస్‌కోట రూరల్: ధర్మవరం పాఠశాలలో..



రాజాంలో..

డంపింగ్ యార్డు తరలించవద్దు

● నర్సిపురం తెలుగుదేశం పార్టీ నాయకులు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పార్వతీపురం రూరల్: పార్వతీపురం పురపాలక సంఘంలోని డంపింగ్ యార్డును నర్సిపురం వద్దకు తరలించేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలను విరమించాలని ఆ గ్రామటీడీపీ నాయకులు గొట్టాపువెంకట రమణ, ఎంపీటీసీతవిటినాయుడు, పంచాయతీవార్డు సభ్యుడు విశ్వేశ్వరరావు, వెంకటరమణ, కోట రాజు, బంకురు రామ, బండి సురేష్ కోరారు. బుధవారం వారు నర్సిపురంలో వారు విలేకరులతో మాట్లాడుతూ డంపింగ్‌యార్డు తమ గ్రామం వద్దకు తరలించవద్దని, ఈ విషయంపై పార్టీలకతీతంగా కలిసికట్టుగా పోరాటం చేస్తామని తెలిపారు.

ఆదివాసీ భాషలోనే విద్యనందించాలి

● ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు లోవరాజు

గుమ్మలక్ష్మీపురం: ఆదివాసీ భాషలోనే ఆదివాసీ ప్రాంత విద్యార్థులకు ప్రాథమిక విద్యనందించాలని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు లోవరాజు కోరారు. గుమ్మలక్ష్మీపురంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీ భాషలో నేర్పిస్తే విద్యార్థులు త్వరగా అర్థం చేసుకుంటారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ భాష వలంటీర్లను నియమించాలని డిమాండ్‌చేశారు. ఆదివాసీ ప్రాంతాల్లో అక్షరాస్యతా శాతం తగ్గుతుందని, దీనికోసం ఆదివాసీ భాషా వలంటీర్లతో సమస్యను పరిష్కరించవచ్చని తెలిపారు.

సరుకులు తడిలేని ప్రదేశంలో నిల్వచేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న సుబ్బరాజు

గుమ్మలక్ష్మీపురం:గోదాముల్లో సరుకులను తడిలేనిప్రదేశాల్లో నిల్వ చేస్తే సరుకులు భద్రంగా పాడవ్వకుండా ఉంటాయని సివిల్ సప్లైస్ సంస్థ విశాఖ జోనల్ మేనేజర్ ఎన్.సుబ్బరాజు పేర్కొన్నారు. బుధవారం గుమ్మలక్ష్మీ పురం గిరిజన సహకార మార్కెటింగ్ సొసైటీ ఆవరణలో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్ గోదాములను పరిశీలించారు. ఆయన వెంట ఎంఎల్‌ఎస్ గోదాం సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావు ఉన్నారు.

లెనిన్ బాటలో యువత నడవాలి

పాచిపెంట: లెనిన్‌బాటలో యువత నడవాలని సీఐటీయూ నాయకులు కోరాడ ఈశ్వరరావు కోరారు.బుధవారం పాచిపెంటలో కార్మిక సంఘాల నాయకులు రెడ్‌బుక్‌డే సందర్భంగా సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విజ్ఞానం అనేది జీవన పోరాటంలోను, రాజకీయ రంగంలోను ఒక సాధనం అని అన్నారు. యువత చెడు మార్గంలోకి వెళ్లి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. సమావేశంలో కార్మిక సంఘం నాయకులు జరజాపు సూకరాజు పాల్గొన్నారు.

డిజిటల్ క్లాస్ రూము మంజూరు

గుమ్మలక్ష్మీపురం:భద్రగిరిరెసిడెన్షియల్ ప్రభుత్వ ఆర్‌ఐటీఐలో రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలతో విద్యార్థులకు డిజిటల్ క్లాసరూము మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు సాంకేతిక విద్యనందించాలన్న లక్ష్యంతో డిజిటల్ క్లాస్ రూమ్ ఏర్పాటు చేసిన ట్లు తెలిపారు.

సీతంపేట ప్రభుత్వోన్నత పాఠశాల అప్‌గ్రేడ్

● జూనియర్ కాలేజీగా మారుస్తూ విద్యాశాఖ పీఎస్ ఉత్తర్వులు

సీతంపేట: స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలను జూనియర్ కాలేజ్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రాథమిక విద్యాశాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు సీతంపేట ఐటీడీఏ పరిధిలో బాలికల రెసిడెన్షియల్ జూనియర్‌కళాశాల, కస్తూర్బా ఒకేషనల్ జూనియర్ కళాశాల నిర్వహిస్తున్నారు. దీంతో ప్రతిసంవత్సరం విద్యార్థులకు సీట్లు లభించకపోవడంతో విద్యార్థులు ఇంటర్ చదువుకు దూరమవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల సీతంపేటకు మంజూరు కావడంతో విద్యార్థులు స్థానికంగానే చదువుకోవడానికి అవకాశంలభించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ ప్రవేశాలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నారు. అయితేఇక్కడ తరగతి గదులు ఇబ్బందికరంగా మారే అవకాశముంది.

పీహెచ్‌సీల పనితీరు మెరుగుకు చర్యలు

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగన్నాథరావు



పీహెచ్‌సీ సిబ్బందికి సూచనలిస్తున్న జగన్నాథరావు

కొమరాడ: జిల్లాలో పీహెచ్‌సీల్లో 24 గంటలూ పనితీరును మెరుగుపరిచే దిశగా చర్యలు చేపడుతున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. మంగళవారం రాత్రి మండలంలో కూనేరు రామభద్రపురం, కొమరాడ పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. ఆ సమయంలో సిబ్బంది అందుబాటులో ఉన్నది లేనిది, పీహెచ్‌సీల 24 గంటల పనితీరును పరిశీలించారు. రాత్రి సమయాల్లో ఏ విధమైన ఆరోగ్య సమస్యలతో ఉన్నవారు చికిత్స కోసం ఆసుపత్రికి వస్తున్నారో రికార్డులను తనిఖీ చేశారు. రాత్రి సమయాల్లో సిబ్బంది పీహెచ్‌సీల్లో అందుబాటులో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పురిటి నొప్పులతో గర్భిణులు ఏ సమయంలోనైనా రావచ్చునని, ప్రసవ గదిలో అవసరమైన వైద్య పరికరాలు, మందులు సిద్ధంగా ఉంచాలన్నారు. నెలవారీగా జరుగుతున్న ప్రసవాల వివరాలు రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్యామ్‌కుమార్, డాక్టర్ శ్రీధర్ ఉన్నారు.

యువ ఓటర్లలో చైతన్యం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: కొత్తగా ఓటు హక్కు పొందిన యువ ఓటర్లను టీడీపీ నాయకులు చైతన్యపరుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాగుండాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం అవసరమని యువ ఓటర్లకు వివరిస్తున్నారు. పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట తదితర మండలాల్లో యువ ఓటర్లను టీడీపీ నాయకులు కలుసుకొని వారి మద్దతు కోరుతున్నారు. ఈ మేరకు నాయకులు గొట్టాపు వెంకటరమణ, పి.సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు తవిటినాయుడు తదితరులు నర్సిపురం గ్రామంలో పర్యటించారు.

వలంటీరు మృతి

పాలకొండ: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వలంటీరు బుధవారం మృతిచెందాడు. ఈనెల 20న విధులు నిర్వహించుకుని ఇంటింటికొచ్చాడు. ఒక్కసారిగా అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో బుధవారం మృతిచెందాడు. దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదు. మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.



మార్చి 9న లోక్ అదాలత్

రాయగడ:జిల్లాలీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో మార్చి తొమ్మిదో తేదీన జాతీయలోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు అథారిటీ కార్యదర్శి నివేదిత పండా ఒకప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అపరిష్కృతంగా ఉన్న సివిల్, క్రిమినల్, మోటరుప్రమాద, విద్యుత్, కుటుంబ, బ్యాంకురుణాలు, భూస్థల వివాదాలు, చెక్ బౌన్స్ వంటి పలు కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

రాయగడలో కళాసృష్టి వార్షికోత్సవం

రాయగడ: స్థానిక రామలింగేశ్వరాలయంలో నటుడు, రచయత, దర్శకుడు గరిమెళ్ల రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి పురస్కరించుకుని కళాసృష్టి 22 వ వార్షికోత్సవం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈసందర్భంగా ఇటీవల షార్ట్‌ఫిల్మ్ తీసిన రచయిత, దర్శకుడు, జి.సతీష్‌కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కళాసృష్టి సంస్థ అధ్యక్షుడు, పురాధ్యక్షుడు మహేష్ పట్నాయక్, పాత్రికేయుడు భళ్లమూడి నాగరాజు, సంస్థ కార్యదర్శి పిల్లల శంకరరావు, గిరీష్ పట్నాయక్, స్పందన కార్యదర్శి డాక్టరేట్ పతివాడ తులసీదాస్, రారసం అధ్యక్షుడు టీవీఎస్‌ఆర్ అప్పారావు, కేకేఎం పట్నాయక్, లాడి సతీష్‌కుమార్, సింగిడి రామారావు, బరాటం గౌరిప్రసాద్, మోహనరావు, సింగిడి రామారావు, రామ్మోహన్ పట్నాయక్, కేజీ ప్రసాద్ పాల్గొన్నారు.

జగన్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు

● దాడులకు పాల్పడడం సిగ్గుచేటు: టీడీపీ నాయకులు

సీఎం జగన్ మాయమాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. బుధవారం వేర్వేరు చోట్ల టీడీపీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. విలేకరులు, తెలుగుదేశం పార్టీ ప్రతినిధులపై దాడులకు పాల్పడటం సిగ్గు చేటన్నారు.

టీడీపీ విజయానికి కృషి చేయాలి: రామ్‌మల్లిక్

పాలకొండ: రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రాంమల్లిక్‌నాయుడు కోరారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణతో కలిసివిలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అరాచక పాలన రాజ్యమేలుతోందని ఆరోపించారు. ప్రశ్నించే ప్రజలు, మీడి యాపై దాడులు చేస్తున్నారన్నారు. సైకో ప్రభుత్వాన్ని గద్దె దించాలంటే ఓటే ఆయుధమన్నా రు. మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ అంశాలను ప్రతి ఇంటికి చేరవేసేలా బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ క్యాలెండర్‌ను ప్రంపిణీ చేయాలని జయకృష్ణ కోరారు.

60 కుటుంబాలు టీడీపీలో చేరిక

వీరఘట్టం:సీతంపేట మండలంలోని గుజ్జి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు60 కుటుంబాలు టీడీపీలోచేరాయి. మండలంలోని ఎం.రాజపురంలో టీడీపీపాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ పార్టీ కండువాలువేసి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రజావ్యతిరేక విధానాలు ఇష్టంలేక టీడీపీలో చేరుతున్నారన్నారు.అనంతరం జయకృష్ణ సూపర్‌సిక్స్‌కిట్లను పంపిణీ చేశారు. పార్టీలో బిడ్డిక ప్రసాద్, బిడ్డిక శ్రీకాంత్, కూ రంగి రాజు, పాలక అదెయ్య, కూరంగి వల్లభరావు, బిడ్డిక సంగ మేషు,గంటపవన్, కొండగొర్రె సంతోష్, మండంగి సురేష్ చేరారు.

వైసీపీ భూస్థాపితం ఖాయం : సంధ్యారాణి

మక్కువ: ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి రాప్తాడు సిద్ధం సభలో విధి నిర్వహణలోఉన్న ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ కార్య కర్తలు, నాయకుల దాడి, ఈనాడు కార్యాలయంపై మంగళవారం జరిగిన దాడి జగన్ రాక్షసానందానికి నిదర్శనమని సాలూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మడి సంధ్యారాణి విమర్శించారు. ఈ దాడులను ఖండిస్తూ బుధవారం మక్కువలో అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.అనంతరం మండలంలోని ఎర్ర సామంతవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించి, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పదోతరగతి విద్యార్థి అశోక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 270మంది విద్యార్థులు ఉన్నా పాఠశాలలో కనీసం ఒక్క ఏఎన్ఎం కూడా లేకపోవడం దారుణమన్నారు. ఇటీవల జిల్లాలో ఆరుగురు విద్యార్థులు మరణించడం ప్రభుత్వ హత్యలేనని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్, నాయకులు ప్రసాదరావు, గౌరీశంకర్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సంక్షేమం

సాలూరు రూరల్: చంద్రబాబునాయుడు సీఎంను చేస్తే సంక్షేమం సాధ్యమని సాలూరునియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గుమ్మిడి సంధ్యా రాణి తెలిపారు.మండలంలోనిపురోహితునివలస,వల్లాపురంల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆముదాల పరమేశు, మక్కువ అధ్యక్షుడు గుల్ల వేణుగోపాలరావు,అక్యాన వెంకట తిరుపతిరావు,ఖరాసవలస ఎంపీటీపీ అప్పికొండ రమాదేవి, తురాయి సత్యం,సూర్యనారాయణ పాల్గొన్నారు.



వీరఘట్టం: పార్టీలో చేరుతున్న వారికి సూపర్‌సిక్స్ కిట్లను అందజేస్తున్న జయకృష్ణ

ఓటమిని గ్రహించే దాడులు: ద్వారపురెడ్డి

గరుగుబిల్లి: ప్రజలను నయవంచనకు గురిచేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించి దాడులకు పాల్పడుతున్నారని అరకు తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ ఆరోపించారు. చిలకాంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికార పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలను కవరేజ్ చేసేందుకు వెళ్లిన ఆంధ్రజ్యోతి రిపోర్టర్‌పై అమానుషంగా దాడి చేయడం విచారకరమన్నారు. జగన్‌రెడ్డి విధానాలను చూసి సొంత పార్టీలోని ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు పలువురు పార్టీకి గుడ్‌బై చెబుతున్నారన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ డి.గౌరమ్మ, టీడీపీ ప్రతినిధులు నారాయణస్వామి, బలరాంనాయుడు, నారాయణరావు, పాల్గొన్నారు.



పాలకొండ: మాట్లాడుతున్న రాంమల్లిక్‌నాయుడు



మక్కువ: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న సంధ్యారాణి



గరుగుబిల్లి : మాట్లాడుతున్న సత్యనారాయణ

మాతృభాషను మరువరాదు

● మాతృభాషా దినోత్సవంలో వక్తలు పిలుపు

ప్రతిఒక్కరూ మాతృ భాషను మరువరాదని వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం మాతృభాషా దినోత్సవం పురస్కరించుకుని పాఠశాలల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు.

పాలకొండ: పట్టణంలోని వెంకమ్మపేటలో ఎంపీయూపీఎస్ పాఠశాలలో హెచ్ఎం జి.పరాంకుశంనాయుడు అధ్యక్షతన మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా తెలుగు పద్యాలు, గేయాలు, కథల పోటీలను నిర్వహించి బహుమతులు అందించారు.మాతృభాషా దినోత్సవర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయిని సీహెచ్ కమలకుమారి, నాగమణి, గౌతమి, వై.మల్లేశ్వరరావు, ఎస్.గోపి, లక్ష్మీకుమారి పాల్గొన్నారు. అలాగే పాలకొండ ప్రభుత్వోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో తాత్కాలిక హెచ్ఎం అనంతరావు మాతృభాష విశిష్టతను వివరించారు. సంస్కృత భాష ఉపాధ్యాయుడు బౌరోతు శంకరరావు పల్లెల్లో మాతృభాష వినియోగం, తెలుగు తియ్యదనాన్ని తెలుగు ఉపాధ్యాయుడు నారాయణరావు, అంతర్జాతీయమాతృభాష విశిష్టను ఆంగ్ల భాష ఉపాధ్యాయుడు శ్రీరామ్మూర్తి విద్యార్థులకు తెలియజేశారు. కార్య క్రమంలో బాబూరావు, సంధ్యారాణి, సులోచనరాణి పాల్గొన్నారు.

●వీరఘట్టంమండలంలోని తలవరంలో మాతృభాషా దినోత్సవం హెచ్ఎం ఉప్పాడ అప్పారావు అధ్యక్షతన సమావేశం జరిగింది. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు కె.జనార్దనరావు, చిట్టితల్లి పాల్గొన్నారు.



పాలకొండ: వెంకమ్మపేటలో మాతృభాషపై వివరిస్తున్న ఉపాధ్యాయులు

● **గుమ్మలక్ష్మీపురం:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీవరం ఆధ్వర్యంలోమాతృభాషాదినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుశాఖ అధ్యక్షులు రామయ్య, ఉపాధ్యాయులు బి.త్రినాథ, కల్పన, తులసి పాల్గొన్నారు.

● **సాలూరు రూరల్:** మాతృభాషను ప్రేమించాలని సామాజిక కార్యకర్త డాక్టర్ కోడూరు సాయిశ్రీనివాస్ పిలుపునిచ్చారు. మాతృభాష దినోత్సవం సందర్భంగా సాలూరులో కోటవీధిలో వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మి పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

● సీపీఎం, గిరిజన సంఘ నాయకుల డిమాండ్



నిరసన దీక్షలు చేస్తున్న గిరిజనులు

సాలూరు రూరల్: గిరిజనుల మధ్య తగాదాలు సృష్టించిన తాజాగా బదిలీపై వెళ్లిన తహసీల్దార్ బాలమురళీకృష్ణ, వీఆర్వో కృష్ణమూర్తిలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం నేత మర్రి శ్రీనివాసరావు, గిరిజన సంఘ నేతలు డిమాండ్‌చేశారు. బుధవారం సాలూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బొర్రపణుకువలస, జిల్లేడువలస గిరిజనులు నిరవధిక నిరసన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నేత మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ 2020 నుంచి గాదెలవలస, బొర్రపణుకువలస, జిల్లేడువలస గిరిజనులకు అటవీ,బంజరు భూ పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తున్నామని,ఈవిషయమై సర్వే సైతం చేశారన్నారు. మూడు గిరిజన గ్రామాల్లో కేవలం గాదెలవలస గిరిజనులకే పట్టాలిచ్చి రెండు గ్రామాలను విస్మరించడం సరికాదన్నారు. ఇలా చేయడం వల్ల గిరిజనుల మధ్య వైషమ్యాలు వచ్చాయన్నారు. ఇందుకు కారణమైన బదిలీపై వెళ్లిన తహసీల్దార్ బాలమురళీకృష్ణవీఆర్వో కృష్ణమూర్తిలపై చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన సంఘనేతలు గాసి,చినబాబుమాట్లాడుతూ గిరిజనులమధ్య వివాదానికి కారణమైన అధికారులపైచర్యలు తీసుకొని,పట్టాలిచ్చే వరకు నిరసన దీక్షలను నిరవధికంగా కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో కొత్తయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

బెలగాం: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ప్రజాపోరు యాత్రను చేపట్టిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా కార్యాలయం వద్ద ప్రజాపోరు యాత్ర-2 ప్రచార రథాలను జెండా ఊపి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపోరు యాత్ర-2తో పల్లెపల్లెకు వెళ్లి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ఎన్నికల ముందు ప్రజల వద్దకు వెళ్లి మోదీ సారథ్యంలో దేశం సాధించిన ప్రగతిని తెలియజేసి ఓటు వేయాలని కోరుతామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు, నాయకులు సొండి సంజీవ్, పేర్రాజు పాల్గొన్నారు.

24న నాగావళి తీరంలో శ్రీచక్ర తీర్థ స్నానం

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవెంకటేశ్వర, కోదండరామస్వామి ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు సుప్రభాత సేవ, నిత్యారాధన, విశేష హోమాలు, మంగళ శాసనాలను ఆలయ అర్చకులు వీవీ అప్పలాచార్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయఈవో వీవీ సూర్యనారాయణ మాట్లాడుతూ కల్యాణ మహోత్సవం ముగింపును పురస్కరించుకుని ఈనెల 24న నాగావళి నదీ తీరంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన స్వామవారికి, అమ్మవార్లకు శ్రీచూర్ణోత్సవం, శ్రీచక్ర తీర్థస్నానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వేసవిలో జాగ్రత్తలు అవసరం: ఏపీడీ

వీరఘట్టం: వేసవి ఎండల కారణంగా వేతనదారులు పనుల వద్దకు మంచి నీరు తీసుకొని వచ్చేలా చూడాలని అదనపు ప్రోగ్రాం అధికారి జి.శ్రీహరిరావు అన్నారు. ప్రస్తుతం మండలంలో 5,200 మంది వేతనదారులు ఉన్నారని.. వచ్చే గురువారం నాటికి ఈ సంఖ్యను 6వేలకు పెంచాలని సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఉదయం ఆరు నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం మూడు నుంచి ఆరు గంటల వరకు పనివేళల్లో మార్పులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జి.సత్యనారాయణ, ఎంపీడీఓ సాల్మన్‌రాజ్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతతో బాధపడే వారిపై దృష్టి : పీడీ



గంగరేగువలస అంగన్‌వాడీ కేంద్రంలో పరిశీలిస్తున్న రాణి

కొమరాడ: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనత ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా ఐసీడీఎస్ పీడీ ఎంఎం రాణి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కొమరాడ ఐసీడీఎస్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించిన అనంతరం గంగరేగువలస- 1, 2 అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనతతో బాధ పడుతున్న వారికి ప్రత్యేక ఆహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి రాజ్యలక్ష్మి, ఐసీడీఎస్ పీవో సుగుణ కుమారి, పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు: ఎస్ఐ

గరుగుబిల్లి:వాహనచోదకులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఎస్ఐ వై.అమ్మన్నరావు హెచ్చరించారు. బుధవారం గరుగుబిల్లి తదితర ప్రాంతాల్లో వాహన తనిఖీలను నిర్వహించారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

జియ్యమ్మవలస:చినమేరంగి సర్కిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్టు ఎస్ఐ ఇ.చిన్నంనాయుడు తెలిపారు. గతంలో సారాతో పట్టుబడిన ఈ వాహనాలు కావలసి వారు గరుగుబిల్లి పోలీస్‌స్టేషన్ వద్దకు గురువారం ఉదయం హాజరుకావాలని ఆయన కోరారు.

26న పట్టబడిన వాహనాలు..

సీతంపేట: సారా తరలింపులో పట్టుబడిన ఆటో పల్సర్ వాహనాలను ఈనెల 26న వేలం వేయనున్నట్లు ఎస్ఐ జగదీష్‌నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆ రోజు ఉదయం 10 గంటలకు జరిగే వేలం పాటలోఆసక్తి ఉన్నవారు వేలంలోపాల్గొనాలని కోరారు.

చినంకలంలో గడ్డివాముల దగ్ధం

సీతానగరం:చినంకలంలో బుధవారం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివాములు దగ్ధమయ్యాయి.ఎనిమిది కుటుంబాలకు చెందిన గడ్డి వాములు దగ్ధమయ్యాయని స్థానిక వీఆర్వోతెలిపారు. బొబ్బిలి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

వాలీబాల్ క్రీడాకారులకు అభినందన

పార్వతీపురం-ఆంధ్రజ్యోతి:వాలీబాల్‌పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన జిల్లా పురుషుల జట్టు క్రీడాకారులను కలెక్టర్ నిశాంత్‌కుమార్ బుధవారం తన చాంబర్‌లో అభినందించారు. ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా ఇటీవల విశాఖలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు.విజేతలకుకప్‌తోపాటు మూడులక్షల చెక్‌ను కలెక్టర్‌అందించారు. కార్యక్రమంలో జిల్లాస్పోర్ట్స్ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ గాంధీ, తిరుపతిరావు, వైకుంఠరావు పాల్గొన్నారు.

వలంటీర్లకు పురస్కారాలు

మక్కువ: మక్కువలో వలంటీర్ల సేవలకు సత్కార వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవ, వజ్ర పురస్కారాలు అందుకున్న వలంటీర్లను ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర సత్కరించి పురస్కార పత్రాలను అందజేశారు.కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, మావుడి రంగునాయుడు, ఎంపీడీవో పి.దేవకుమార్ పాల్గొన్నారు.

ఇంటికి చేరిన విద్యార్థిని

జియ్యమ్మవలస:అదృశ్యమైన విద్యార్థిని ఇంటికి చేరింది.పార్వతీపురంలో డిగ్రీచదువుతున్నతన కుమార్తె పరీక్షలకోసం ఈనెల1న వెళ్లి అదృశ్యమైనట్లు చింతల బెలగాంకు చెందిన ఎం.శ్రీలత తండ్రి గౌరునాయుడు ఈనెల5న ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఇ.చిన్నంనాయుడు కేసు నమోదుచేశారు. బుధవారం శ్రీలత అదే గ్రామానికి చెందిన ప్రసాద్‌ను వివాహం చేసుకుని స్టేషన్‌కు వచ్చిందని ఎస్ఐ తెలిపారు. తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. తల్లిదండ్రులు స్టేషన్‌కు వచ్చిన తర్వాత వారికి నచ్చజెప్పి వారితో శ్రీలత, ఆమె భర్త ప్రసాద్‌ను పంపించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

శ్రీనిధి రుణాలు రికవరీ చేయండి

● ఇన్‌చార్జి డీఆర్‌డీఏ పీడీ సత్యంనాయుడు

గరుగుబిల్లి: శ్రీనిధి రుణాలను తీసుకున్న వారి నుంచి రికవరీ చేయాలని ఇన్‌చార్జి డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యంనాయుడు కోరారు. బుధవారం గరుగుబిల్లి వెలుగు కార్యాలయంలో సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగు సంఘాల ఆధ్వర్యంలో మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. ఎన్ఎల్ఎం పథకంలో 50 శాతం రాయితీపై రుణాలను అందించే చర్యలు చేపడుతున్నామన్నారు.తక్కువ ధరలకు నిత్యావసర సరుకులను అందించేందుకు మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న సంఘాలు సక్రమ పద్ధతుల్లో చెల్లింపులు చేసేలా దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఏపీఎం అప్పలనాయుడు, సీసీలు తిరుపతిరావు, రామినాయుడు, వి.లక్ష్మణరావు, కె.కృష్ణ ప్రసాద్, కె.రమేష్, శాంతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యంనాయుడు